క్లుప్తంగా

ముగిసిన మనీష అంత్యక్రియలు

● పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన సమస్య



వేలేరు: మండలంలోని పీచర గ్రామానికి చెందిన శివరాత్రి మనీష(18) మూడు రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. కాగా మనీష సోదరుడు కుమారస్వామికి న్యాయం చేయాలని బంధువులు, గ్రామస్తులు రెండు రోజులుగా అంత్యక్రియలు నిర్వహించకుండా మృతదేహంతో నిరసన తెలుపుతున్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈసందర్భంగా పలువురు బంధువులు మాట్లాడుతూ.. మనీషా సోదరుడు కుమారస్వామికి తండ్రి శివరాత్రి రాజుతో ప్రాణభయం ఉందని ఆరోపించారు. ఇలా కాకుండా ఉండాలంటే తండ్రి రాజు పేరుపై ఉన్న వ్యవసాయ భూమి 4.20 ఎకరాలు కుమారస్వామి పేరుపై పట్టా చేసేవరకు అంత్యక్రియలు చేసేది లేదని తెలిపారు. విషయం తెలుసుకున్న కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి వేలేరు పోలీసు స్టేషన్‌కు వచ్చి మృతురాలి బంధువులతో మాట్లాడి కుమారస్వామికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బంధువులు అంత్యక్రియలు జరిపించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన గాజుల మల్లయ్య భార్య అరుణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మల్లయ్యతోపాటు 10వ తరగతి చదువుకున్న స్నేహితులు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.5,091 సాయం అందించి భరోసా కల్పించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ధర్మసాగర్: మండలంలోని నారాయణగిరి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణగిరి గ్రామానికి చెందిన దేవరుప్పుల కుమారస్వామి తన ఇంటికి తాళం వేసి ఈనెల 10వ తేదీన తన భార్యతో కలిసి హైదరాబాద్‌లోని తన కుమారుడి వద్దకు వెళ్లాడు. తాళం వేసి ఉండగా గమనించిన దొంగలు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం ఇంటి పక్కవారు చూసి కుమారస్వామికి సమాచారం అందించారు. దీంతో శనివారం నారాయణగిరికి వచ్చి చూసి ఇంట్లో బీరువాలోని ఆరు గ్రాముల బంగారం, రూ.20 వేలు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపింది.

నేలకొరిగిన శివాల మర్రి



ఐనవోలు: సుమారు 100 యేండ్లకు పైగా చరిత్ర కలిగి, మండల కేంద్రంలో శివాల మర్రి దేవతా వృక్షంగా స్థానికులు పిలుచుకునే మర్రిచెట్టు ఆదివారం సాయంత్రం నేలకొరిగింది. పూర్వం ప్రఖ్యాత మల్లికార్జునస్వామి ఆలయానికి వచ్చే భక్తులు మొదట శివాల మర్రిని దర్శించుకుని ప్రదక్షిణ చేసిన తర్వాతే మల్లన్నను దర్శించుకునే వారని స్థానికులు చెబుతారు. ఇప్పటికీ ఆలయానికి వచ్చే శివసత్తులు మొదట దేవతా వృక్షం వద్దకు వెళ్లి ఆశీర్వాదం తీసుకుని వారి వేషధారణ మార్చుకుని గజ్జెల లాగులు కట్టుకుని మల్లన్న దైవ దర్శనానికి వస్తుంటారు. ఇంతటి నేపథ్యం కలిగిన శివాల మర్రిచెట్టు ఇటీవల కురిసిన వర్షాలకు నేలకొరగడం కలిచి వేసిందని ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఓ అర్చకుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. నిపుణుల సలహాతో భారీ యంత్రాల సాయంతో శివాల మర్రిని మరోచోట పునరుద్ధరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

విద్యారణ్యపురి : కేంద్రప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సాహిత్య, సాంస్కృతిక వేదిక కన్వీనర్ మెట్టు రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ వడ్డేపల్లిలో నిర్వహించిన తంగెళ్ల శృతి యాది సభకు శృతి తండ్రి తంగెళ్ల సుదర్శన్ అధ్యక్షత వహించగా రవీందర్ ప్రధానవక్తగా మాట్లాడారు. సమాజంలో అసమానతలు నిర్మూలించకుండా ఉద్యమకారులను హతమార్చటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రసాధనతో కలలు నెరవేరుతాయని భావించిన యువతకు ఫలితం లభించలేదన్నారు.

సైనికుల అడ్డా.. పరకాల గడ్డ

● బాల్యం నుంచే ఆర్మీ కల
● పాక్, చైనా సరిహద్దుల్లో పరకాల సైనికుల సేవలు

పరకాల: నిజాం పాలన నుంచి అనేక పోరాటాల్లో యోధులకు స్థావరంగా ఉన్న పరకాల గడ్డ.. నేడు దేశ రక్షణ కోసం నిలుస్తున్న ఎంతో మంది సైనికులకు అడ్డాగా మారింది. పరకాల నుంచి అనేక మంది సైనికులు దేశ భద్రత కోసం సేవలు అందిస్తున్నారు. సరిహద్దులో శత్రుదేశాలను తిప్పికొడుతూ సత్తా చాటుతున్నారు. పరకాల నుంచి ఆర్మీ, సీఆర్‌ఎఫ్, పారామిలటరీ సైనికులుగా అనేకమంది యువత పనిచేస్తూ ఈ ప్రాంతానికి గౌరవాన్ని తెచ్చారు. దేశసేవలో నిమగ్నమైన పరకాల సైనికులు కొందరిని పరిచయం చేసుకుందాం.

స్నేహితుల ప్రోత్సాహంతో..

- లక్కం సాయికుమార్, సైనికుడు



పరకాలకు చెందిన లక్కం స్వరూప, మల్లయ్య కుమారుడు లక్కం సాయికుమార్. తన స్నేహితుల ప్రోత్సాహంతో 2015 సంవత్సరంలో ఆర్మీ సైనికుడిగా ఎంపికయ్యాడు. మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో విధులు నిర్వర్తించి ప్రస్తుతం జమ్మూ కశ్మీర్ సరిహద్దుల్లో పనిచేస్తున్నాడు.

ఆర్మీపై మక్కువ

-రవితేజ, సైనికుడు



పరకాల పట్టణానికి చెందిన శ్రీహరి, లత రెండో కుమారుడు రవితేజకు విద్యార్థి దశ నుంచే ఆర్మీపై మక్కువ. 2013 సంవత్సరంలో భారత సైన్యంలో చేరి జమ్మూ కశ్మీర్, ఢిల్లీ, పంజాబ్, కార్గిల్‌లో విధులు నిర్వహించాడు. ప్రస్తుతం శ్రీనగర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..

- చెలుపురి శివకుమార్, సైనికుడు



పరకాల పట్టణానికి చెందిన చెలుపురి శివకుమార్ తల్లిదండ్రులు సాంబలక్ష్మి, రాజమౌళి ప్రోత్సాహంతో 2013 సంవత్సరంలో పారామిలటరీలో చేరాడు. అరుణాచల్ ప్రదేశ్, ఝార్ఖండ్, బిహార్, ఉత్తరాఖండ్‌లో విధులు నిర్వహించి ప్రస్తుతం చైనా సరిహద్దుల్లో పనిచేస్తున్నాడు.

సైనికుడు కావాలనే కల

- మహమ్మద్ సోహైల్ ఖాన్, పరకాల



బాల్యం నుంచే సైనికుడు కావాలన్న కల.. పెద్దనాన్న కుమారుడి స్ఫూర్తితో భారత సైనికుడయ్యాడు మహమ్మద్ సోహైల్ ఖాన్. పరకాలకు చెందిన సాధిక్, ఫహీమాల కుమారుడు సోహైల్ ఖాన్ 2015లో పారా మిలటరీ కేంద్ర భద్రతాదళ ఐటీబీపీలో చేరాడు. తమిళనాడు, హర్యానా, ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్, జమ్మూ కశ్మీర్ రాష్ట్రాల్లో విధులు నిర్వహించాడు.

అమ్మకు ఆసరాగా ఉంటూనే..

– ఏకు చిరంజీవి(బబ్లూ)



పరకాల పట్టణంలోని రాజీపేట కాలనీకి చెందిన ఏకు చిరంజీవి తండ్రి సాంబయ్య చిన్నతనంలో మృతి చెందడంతో తల్లి వనమ్మకు కష్టాలు మొదలయ్యాయి. తల్లిపడే కష్టాలు చూసిన చిరంజీవి చిన్నతనం నుంచే తల్లికి ఆసరాగా స్కూల్ సెలవుల్లో దుకాణాల్లో పనిచేస్తూ 2010 సంవత్సరంలో ఆర్మీలో చేరాడు. ప్రస్తుతం నేపాల్ సరిహద్దులలో విధులు నిర్వర్తిస్తున్నాడు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



అవగాహన కల్పిస్తున్న రంజిత్‌కుమార్

కమలాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థిక, సామాజికాభివృద్ధి సాధించాలని సంఘమిత్ర వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మోరె రంజిత్‌కుమార్ సూచించారు. మండలంలోని కానిపర్తిలో ఆదివారం సంఘమిత్ర వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉద్యోగిని యోజన పథకంలో చిన్న వ్యాపారాలు చేస్తూ రూ.3 లక్షల వరకు సబ్సిడీ, పరిశ్రమల ద్వారా 45 శాతం, ప్రధాన మంత్రి స్వయం ఉపాధి పథకం ద్వారా 35 శాతం, పీఎంఎఫ్ఈ పథకం ద్వారా 35 శాతం సబ్సిడీ రుణాలు పొందవచ్చన్నారు. సోషల్ వర్కర్ ఎర్ర నాగరాజు మాట్లాడుతూ.. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా నాటుకోళ్ల పెంపకం, గొర్రెలు, మేకలు, పందుల పెంపకం, డెయిరీ ఫామ్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలపై, మహిళా రుణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి రెడ్డి నాగరాజు, వీఓ అధ్యక్షులు అనిత, పద్మ, సీఏ సంధ్య, మహిళా సంఘ సభ్యులు రేణుక, శ్రీలత, వరలక్ష్మి, అనూష, రమ, కొంరమ్మ, మమత, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



అసోసియేషన్ నూతన కార్యవర్గ బాధ్యులు

పరకాల: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ పరకాల యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి రవీందర్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ పరకాల యూనిట్ నూతన కార్యవర్గ సమావేశం అనంతరం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఆర్.వీరబ్రహ్మం, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎ.రామదాసు, ఉపాధ్యక్షుడిగా వి.మొగిళి, ప్రధాన కార్యదర్శిగా కె.సమ్మయ్య, కోశాధికారిగా ఎస్.రామన్న, జాయింట్ సెక్రటరీగా జి.శేఖరయ్య, ప్రచార కార్యదర్శిగా వి.రాజమల్లయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.వెంకటమల్లయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎం.నర్సింహారామయ్య, ఎస్.లింగమూర్తి, పి.కుమారస్వామిని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి వెల్లడించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కె.గోపాల్ రెడ్డి, ఎం.డీ ఖాజామొద్దీన్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మారెడ్డికి వ్యాపారాలు తప్ప సేవ తెలియదు

● పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల: అభివృద్ధి ముసుగులో అందినంత దోచుకున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి వ్యాపారం చేయడం తప్ప ప్రజాసేవ చేయడం తెలియదని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. తన నుంచి మంచి వాళ్లను దూరం చేయడానికి పనికి మాలిన ఆరోపణలు చేయడంతోపాటు దొంగే దొంగ అన్నట్లు విమర్శలు ఉన్నాయని అన్నారు. పరకాల పట్టణంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. బాధ్యత గల రాజకీయ పార్టీల నాయకులు ప్రజలను పక్కదోవ పట్టించకుండా యూరియా కొరతపై నిజాయితీగా మాట్లాడాలన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు మొత్తం 16వేల మెట్రిక్ టన్నులకుగాను 14వేల 400 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. మిగతా యూరియా మరికొద్ది రోజుల్లో వస్తుందన్నారు. అభివృద్ధి పనులను అడ్డుకున్నట్లు స్థానిక మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులను తీసుకెళ్తుంటే పనికిమాలిన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంట్రాక్టర్ల వద్ద నుంచి తన పీఏ సంతోష్ కమీషన్లు తీసుకుంటున్నట్లు ఆరోపిస్తున్న ధర్మారెడ్డి ఆధారాలు ఉంటే నిరూపించాలని సవాల్ విసిరారు. పరకాలను విద్య, వ్యాపార, వాణిజ్య పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో కృషిచేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ పాడి కల్పనాదేవి, కాంగ్రెస్ పార్టీ పరకాల మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, కొయ్యడ శ్రీనివాస్, కమలాపురం రమేష్, బీరం సుధాకర్ రెడ్డి, బుర్ర దేవేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరకాల: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రేవూరి



ఐనవోలు: నివాళులర్పిస్తున్న అరూరి రమేష్

పరకాల: అనారోగ్యంతో మృతిచెందిన పరకాల మాజీ జెడ్పీటీసీ సిలువేరు మొగిళి కుటుంబ సభ్యులను పరకాల ఎమెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. మొగిళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే రమేష్ ఆధ్వర్యంలో..

ఐనవోలు: మండలంలోని పంథిని గ్రామానికి చెందిన దంసాని వెంకటయ్య, ఉప్పునూతల వీరలక్ష్మి, ఉప్పరి యాదమ్మ.. ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బాధిత కుటుంబాలను ఆదివారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్ధన్నపేట మండల పరిధిలోని రామారం గ్రామానికి చెందిన మల్లారెడ్డి, కర్ర వెంకటరెడ్డి, గజ్జల యాకన్న ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వీరివెంట స్థానిక నాయకులు ఉన్నారు.

పరామర్శ

ఆత్మకూరు: మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కోడెపాక భద్రయ్య కుటుంబాన్ని ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షురాలు సావురే కమల రాజేశ్వర్‌రావు పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

యూరియా కోసం రాత్రి నుంచే క్యూ



పీఏసీఎస్ వద్ద చీకట్లో వేచి ఉన్న రైతులు



ఊరుగొండ పీఏసీఎస్ ఎదుట చెప్పుల క్యూ

దామెర: యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడంలేదు. ఊరుగొండ, దుర్గంపేట, దమ్మన్నపేట, సీతారాంపూర్, ల్యాదెళ్ల రైతులకు సోమవారం యూరియా పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించడంతో ఊరుగొండ(పెద్దాపూర్) పీఏసీఎస్ వద్దకు ఆదివారం రాత్రే రైతులు పెద్దఎత్తున చేరుకున్నారు. ఉదయం వరకు రైతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ముందస్తుగా చేరుకొని చెప్పులను క్యూలో ఉంచి సమీపంలో పడిగాపులుకాస్తున్నారు.

క్రీడలతో పోటీతత్వం పెరుగుతుంది

● కేయు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వెంకయ్య

మామునూరు: క్రీడా పోటీల ద్వారా విద్యార్థినుల్లో పోటీతత్వం పెరుగుతుందని కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వెంకయ్య, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ సీహెచ్ సుదర్శన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే. సునీల్‌రెడ్డి , ఆర్గనైజింగ్ సెక్రటరీ రామాంజనేయుల సూచించారు. బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల క్రీడామైదానంలో కాకతీయ యూనివర్సిటీ ఇంటర్నల్ కాలేజీ టోర్నమెంట్స్ ఫర్ ఉమెన్-2025 వారి ఆధ్వర్యంలో వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల సహకారంతో రెండు రోజులుగా జరుగుతున్న బాలికల కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. వాగ్దేవి విద్యాసంస్థల డైరెక్టర్ సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ క్రీడలు దేహదారుఢ్యానికి, ఆరోగ్యం, మానసికకోల్లాసానికి దోహదపడుతాయన్నారు.

కేంద్రం నిర్లక్ష్యంతోనే యూరియా ఇబ్బందులు

● భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కాట్రపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాలకు యూరియా సరఫరా చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఇబ్బందులు ఏర్పడుతున్నాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆరోపించారు. మండలంలోని కొప్పుల, కాట్రపల్లి గ్రామాల్లో రూ.10.44లక్షల అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్రం రాష్ట్రాలకు యూరియా పంపిణీ చేయకుండా ఇబ్బందులు పెడుతుంటే రాష్ట్రంలో బీఆర్‌ఎస్ నాయకులు యూరియా కోసం ధర్నా చేయడం విడ్డూరమన్నారు. ప్రజా ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేసి రైతులకు సరిపడా యూరియాను తెప్పిస్తుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని, గ్రామీణ రహదారులు బాగుంటేనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ నిధులతోపాటు ఇతర పథకాల ద్వారా రోడ్డు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుపేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీతో ప్రజల రక్తాన్ని తాగుతుందని, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నాయని మండిపడ్డారు. నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని, నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి, మంత్రులతో కొట్లాడి నిధులు తీసుకొచ్చి అభివృద్ధిలో ముందు వరుసలో ఉంచుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



క్షతగాత్రుడు రహీం

వేలేరు: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల సమీపంలో రెడీమిక్స్ లారీ, బైక్ ఎదురెదురుగా ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై అజ్మీరా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ మండలంలోని కాశగూడేనికి చెందిన సయ్యద్ రహీం వ్యక్తిగత పని నిమిత్తం వేలేరుకు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో గురుకుల పాఠశాల సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న రెడీమిక్స్ లారీ అతివేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలతో రోడ్డుమీద పడి ఉన్న రహీంను స్థానికులు 108 అంబులెన్స్‌లో ఎంజీఎంక ఆస్పత్రికి తరలించారు. బాధితుడు రహీం సోదరుడు సయ్యద్ జమాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లే..

ఖిలా వరంగల్: రక్త దానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని, ఈనెల 17న నిర్వహించే మెగా రక్తదాన శిబిరానికి ప్రతీ ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ పిలుపునిచ్చారు. ఆదివారం కరీమాబాద్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు బోరిగం నాగరాజు ఆధ్వర్యంలో సేవా పక్షం వరంగల్ జిల్లా కో కన్వీనర్ కర్నె రవీందర్ అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు.

కాంగ్రెస్‌లో చేరలేదనే సొసైటీ చైర్మన్ల తొలగింపు

● మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



మాట్లాడుతున్న చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు: కాంగ్రెస్‌లో చేరడం లేదనే నెపంతో సొసైటీ చైర్మన్లను తొలగించడం దుర్మార్గమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. హనుమకొండలోని ఆయన నివాసగృహంలో నియోజకవర్గంలోని పలువురు సొసైటీ చైర్మన్లతో ఆదివారం ధర్మారెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 14న పీఏసీఎస్ పాలకవర్గాల పొడిగింపు జరిగినప్పటి నుంచి ఇతర పార్టీలకు చెందిన చైర్మన్లను కాంగ్రెస్ పార్టీలో చేరాలని అధికార పార్టీ నేతలు, అధికారులు ఒత్తిడి తెచ్చారని అన్నారు. పార్టీ మారని చైర్మన్లను పొంతనలేని సాకులతో తొలగించడం ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. రూ.2 లక్షల లోపు రుణాలు ఉన్న సభ్యులను తొలగించడం దారుణమన్నారు. ఓటమి భయంతోనే ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం లేదని అభిప్రాయపడ్డారు. రైతులకు సరిపడా యూరియా ఇవ్వడం చేతకాని ప్రభుత్వం బీరాలు పలుకుతోందని ఎద్దేవ చేశారు. ప్రస్తుత సొసైటీ పాలకవర్గాలను రద్దు చేసి తిరిగి ఎన్నికలు నిర్వహించాలని సవాల్ విసిరారు. సమావేశంలో వివిధ సంఘాల చైర్మన్లు, సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రాజయ్య దిష్టిబొమ్మ దహనం



రాజయ్య దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

వేలేరు: స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య దిష్టిబొమ్మను మండల కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజయ్యకు కడియం శ్రీహరి పేరు తలుచుకోనిదే నిద్ర పట్టడం లేదని విమర్శించారు. ఎమ్మెల్యే కడియంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం రాజయ్యకు తగదని హితవు పలికారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేస్తుంటే బీఆర్‌ఎస్ నాయకులకు కనబడట్లేదని విమర్శించారు. ప్రతీ పనికి, దళిత బంధు పథకానికి కమీషన్లు తీసుకున్న చరిత్ర రాజయ్యదని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి సంపత్, 'కుడా' మాజీ డైరెక్టర్ బిల్లా యాదగిరి, మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రణధీర్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్ నాయక్, జుర్రు సంపత్, శ్రీనివాస్‌రెడ్డి, సంపత్, శ్రీనివాస్, సలీం మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

టీ-శాట్ ద్వారా ఉత్తమ టీచర్ ప్రసంగం



ప్రసంగిస్తున్న సీహెచ్.రాములు

విద్యారణ్యపురి : హైదరాబాద్‌లోని టీ-శాట్ ద్వారా ఇటీవల రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన హనుమకొండలోని లష్కర్‌బజార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు సీహెచ్.రాములు ప్రసంగించారు. ఆదివారం హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని టీ-శాట్ సీఎంఓ అధ్యక్షతన ప్రత్యక్షప్రసారం నిర్వహించారు. ఉపాధ్యాయుడిగా ఎలా తన సృజనాత్మక శక్తితో విద్యార్థులకు విద్యాబోధన చేయాలో, ఉపాధ్యాయులకు ఆదర్శ గుణాలు ఎలా ఉండాలో అవి విద్యార్థులకు ఎలా ఉపయోగపడాలో వివరించారు. నిర్వాహకులు రాములును సన్మానించారు.